క్లుప్తంగా

నరసింహునికి సింహాసనం బహూకరణ



సింహాసనాన్ని అందజేస్తున్న దాతలు

ఏన్కూరు: మండల పరిధిలోని గార్లఒడ్డు శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయానికి తల్లాడకు చెందిన బొజ్జ వెంకటేశ్వర్లు-కమలమ్మ దంపతులు రూ.55 వేల విలువగల టేకు సింహాసనాన్ని శుక్రవారం అందజేశారు. స్వామి వారి కల్యాణ మహోత్సవ నిమిత్తం సింహాసనాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు బీటుకూరి వేణుగోపాలచార్యులు, నాగరాజు ఆచార్యులు పాల్గొన్నారు.

సన్మానం



నాగరాజును సన్మానిస్తున్న నాయకులు

మధిర/ఎర్రుపాలెం: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, జమలాపురానికి చెందిన వెల్లంకి నాగరాజును శుక్రవారం నాయీబ్రాహ్మణ సేవా సంఘ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ మేరకు సంఘం నాయీబ్రాహ్మణ సేవా సంఘ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు తూముల నాగభూషణం, ప్రధాన కార్యదర్శి ఆలేటి సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు వెంకటప్పయ్య ఆధ్వర్యంలో వెల్లంకి నాగరాజు, రాజేశ్వరి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయీబ్రాహ్మణ సేవా సంక్షేమ అధ్యక్షుడు గజ్జెల్లి వెంకన్న, గౌరవ సలహాదారులు లింగంపల్లి అప్పారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ జంపాల జంపన్న, గుండె మెడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

మధిర: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు హెచ్చరించారు. తహసీల్ కార్యాలయం నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గత నెలలో మంజూరు చేసిన కూపన్ తేదీని అక్రమ రవాణాదారులు మార్పు చేసి శుక్రవారం జారీ చేసినట్లుగా మార్చారు. దీంతో సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ రాంబాబు రాయపట్నం ఇసుక రేవు వద్దకు వెళ్లి బిల్లులను తనిఖీ చేశారు. ఆ గడువును కొట్టేసి, తేదీ మార్పు చేసి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. అంతేకాకుండా కొన్ని ట్రాక్టర్లకు నెంబర్ ప్లేట్లు కూడా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల కోసం మంజూరు చేసిన కూపన్లను దుర్వినియోగం చేస్తే సహించేది లేదన్నారు.

గురుకులానికి పుస్తకాలు వితరణ



పుస్తకాలతో అధ్యాపకులు, విద్యార్థులు

కొణిజర్ల: మండలపరిధిలోని తనికెళ్లలో తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు సుల్తాన్ చాంద్ ద్రౌపదీ దేవీ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారు 1,640 పుస్తకాలను కళాశాల గ్రంథాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.రజని ఫౌండేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ యం నవ్య, కోఆర్డినేటర్లు కేపీ.ఐశ్వర్య, దీప్తి, రాజేశ్వరి, కె.రజని తదితరులు పాల్గొన్నారు.

భాషా నైపుణ్యం అవసరం

సత్తుపల్లిటౌన్: జ్ఞానం ఎంత ఉన్న భాషా నైపుణ్యం లేకపోతే ఉపయోగం లేదని, వ్యక్తి అభివృద్ధికి భాషా నైపుణ్యం ఎంతో అవసరమని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.గోపి అన్నారు. స్థానిక జేవీఆర్ కళాశాలలో శుక్రవారం హిందీ విభాగం ఆధ్వర్యాన హిందీ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. హిందీ విభాగాధిపతి డాక్టర్ పద్మారాణి, సుహాసిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్యాగాలు మరువలేనివి

బోనకల్: తెలంగాణ సాయుధ పోరాటంలో అమరవీరుల త్యాగాలు మరువలేనివని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. మండలంలోని గోవిందాపురం (ఎల్) గ్రామంలో శుక్రవారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జయరాజు, రోషన్‌కుమార్, వెంకటేశ్వర్లు, కృష్ణారావు నాయకులు తదితరులు పాల్గొన్నారు

నల్లబారిన తెల్లబంగారం..



ఆకులు రాలిపోయిన పత్తిచేను

ఎడతెరపి లేని వర్షాలకు కుదేలైన పత్తి రైతులు

- కుళ్లిన కాయలు.. వడలిపోయిన మొక్కలు
- కొత్తరకం వైరస్‌తో పండుబారిన చేలు
- ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని వేడుకోలు



నల్లగా మారిన పత్తి

బోనకల్: ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో ఎడతెరపి లేని వర్షాలు పత్తి రైతును నట్టేట ముంచాయి. దీంతో వేలాది రూపాయిలు పెట్టుబడి పెట్టి పండించిన పంట ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు కాయలు నల్లబారి కుళ్లి తీవ్రనష్టం వాటిల్లింది. ఫలితంగా సీజన్ మొదట్లోనే పత్తి రైతులు కుదేలయ్యారు.

ముందస్తుగా సాగు..

ఈ ఏడాది తొలకరి జల్లులు పడకముందే అన్నదాతలు మేలో పొడి దుక్కిలోనే పత్తి విత్తనాలను విత్తారు. మే చివరి వారంలో పడిన జల్లులకు పత్తి విత్తనాలు మొలకెత్తాయి. బోనకల్ మండలంలో ఖరీఫ్ పంటగా 18 వేల ఎకరాల్లో రైతులు పత్తిసాగు చేశారు. గతేడాదితో పోలిస్తే 2 వేల ఎకరాల్లో అదనంగా సాగు చేపట్టారు. మొదటి రెండు నెలలు అడపాదడపా జల్లులకు పత్తి ఏపుగా పెరగడంతోపాటు తక్కువ వర్షపాతం నమోదై పూతకాయతో ఆశాజనకంగా ఉంది. కానీ నెలరోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలంలో నీరు నిలిచి ఉలక తీశాయి. అధిక తేమతో చెట్టు వడలిపోయి ఎండిపోతున్నాయి. కాసిన మొదటి దశ కాయలు వర్షాలకు నల్లబారి కుళ్లిపోయాయి. దీంతో రైతుకు సెప్టెంబర్‌లో రావాల్సిన పత్తి వర్షార్పణం అయింది. ఎకరాకు 30 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. కనీసం ఎకరాకు రెండు, మూడు క్వింటాళ్లు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేక అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీనికి తోడు లేత పత్తి చేలకు వైరస్ సోకి ఆకులు పండుబారి పసుపు రంగుకు మారాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలతో దెబ్బతిన్న పత్తి చేన్లను సర్వే చేసి నష్టపరిహారం అందించాలని రైతులు వేడుకుంటున్నారు.

వర్షాలు నష్టాన్ని మిగిల్చాయి.



ఈ ఏడాది అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. 16 ఎకరాలు పత్తి సాగు చేశా. సుమారు రూ. 5 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. చేతికందే సమయంలో అకాల వర్షాలు తీవ్రంగా నష్టాన్ని కలిగించింది. కనీసం క్వింటా పత్తి కూడా చేతికి రాలేదు. దీనికి తోడు వైరస్ సోకడంతో పత్తి చేను పండుబారిపోయింది. ఎన్ని మందులు కొట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

– వల్లెబోయిన కొండల్‌రావు, రాయన్నపేట

నష్టపరిహారం అందించాలి



అకాల వర్షాల వలన పత్తిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. 12 ఎకరాలలో పత్తి పంట సాగు చేశాను. పెట్టుబడి అంతా పూర్తయిన తరువాత వర్షాలు ఎక్కువగా కురవడంతో ఉలకతీసి ఆకులు రాలేశాయి. పడిన కొద్దిపాటి కాయలు నల్లబడి దెబ్బతిన్నాయి. దీంతో తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం స్పందించి పంటనష్టం అంచనా వేసి పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– దారగాని కృష్ణ, ముష్టికుంట్ల

ఉన్నత లక్ష్యాలు సాధించండి..

- ఎమ్మెల్యే రాగమయి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్: ప్రస్తుత పోటీ ప్రపంచానికి దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. పట్టణంలోని రాణి ఫంక్షన్‌హాల్‌లో ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ సంస్థ ఆధ్వర్యాన పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు మోటీవేషన్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత పేదరిక స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకునేందుకు ఉన్నత లక్ష్యాలతో కష్టపడి చదివి సాధించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలతో పాటు తమ ఆశా సంస్థ ద్వారా పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఏసీపీ రఘు, మున్సిపల్ కమిషనర్ నర్సింహా, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, గాదె చెన్నారావు, తోట సుజలరాణి, చల్లగుళ్ల నర్సింహారావు, చల్లగుండ్ల కృష్ణయ్య, ఎండి.కమల్‌పాషా, మోటీవేషన్ టీమ్ సుధాకర్, రంజిత్‌తో పాటు పాల ప్రవీణ్‌రెడ్డి, రామకృష్ణమాచార్యులు, లింగారెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం నిర్మించాలి



మాట్లాడుతున్న సీఐ మధు

మధిర: డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని మధిర సీఐ మధు అన్నారు. ఈ మేరకు సిరిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మాదకద్రవ్యాల నిరోధంపై కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎన్ శాస్త్రీ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు దేశ భవితకు పట్టుగొమ్మలని, యువత సరైన మార్గంలో నడిస్తేనే దేశ భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. యువత తెలియక మత్తు పదార్థాలు తీసుకుంటే వాటి నుంచి బయటపడేందుకు టోల్ ఫ్రీ నంబర్లకు, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు గాని తెలియచేసి సాయం తీసుకోవాలన్నారు. రూరల్ ఎస్సై లక్ష్మీభార్గవి మాట్లాడుతూ.. టీనేజీలో ఉన్న విద్యార్థులు హార్మోన్ల ప్రభావంతో ఆకర్షణకు లోనై ప్రేమ పేరుతో మోసపోయి ఇబ్బందులకు గురికావద్దన్నారు. విద్యాసంస్థలు పవిత్రమైనవని, వాటిలో అసాంఘిక శక్తులు ప్రవేశిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మురళి, స్టూడెంట్ కౌన్సిల్ టీచర్ విజయలక్ష్మి, నరసింహారావు, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుబల్లి: పెనుబల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ రసరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు మండలంలో పెనుబల్లి, వీఎం .బంజరు, రామచందరావు బంజరు, ఎడ్లబంజరు, రంగారావు బంజరు, సీతారాంపురం, టేకులపల్లి, చీన్యాతండా, గోపాలపురం, బయ్యన్నగూడెం, నాయకులగూడెం, మొండికుంట, మండాలపాడు గ్రామాలకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

కల్లూరురూరల్: మండలంలోని బత్తులపల్లిలోని సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు బత్తుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం, కొత్తబోడుమిల్లి, బత్తుపల్లి,సాంబయ్య బంజరు, రామకృష్ణాపురం, కొత్త నారాయణపురం, కొర్లగూడెం, ఎ.నారాయణపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ పి.వెంకట్ తెలిపారు.

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా సబ్‌స్టేషన్ పరిధిలోని మిట్టపల్లి, నూతనకల్, వెంగన్నపేట, రంగంబంజర, నారాయ్య బంజర, మల్సూర్‌తండా, రామానుజవరం, లక్ష్మీపురం, పినపాక, వెంకటాపురం, పాయాపూర్, యజ్ఞ నారాయణపురం గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు కుర్నవల్లి సెక్షన్ ఏఈ దారా కృష్ణకాంత్ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా తల్లాడ పట్టణ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా తల్లాడ, నారాయణపురం, మల్లారం గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాయల ప్రసాద్ తెలిపారు. .

ఉచిత హోమియో వైద్యశిబిరం

కల్లూరురూరల్: మండలంలోని చిన్నకోరుకొండిలో శుక్రవారం ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హోమియో వైద్యులు డాక్టర్ ఎస్‌కె.మారేబాబు, ప్రభుత్వ పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్ సాకేత్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల బెడదను అరికట్టాలని సూచించారు. యోగా టీచర్ డాక్టర్ బి.కృష్ణయ్య యోగా గురించి ప్రజలకు అవగాహనపై కల్పించారు. ఖమ్మంపాటి సత్యనారాయణ, కుమ్మరి రామారావు, వెంకటేశ్వరరావు, బూడిద భిక్షంబాబు, రామారావు, పంచాయతీ కార్యదర్శి గొల్లపూడి మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మర్లపాడు జెడ్పీ పాఠశాలలో..

వేంసూరు: మర్లపాడు జీవీఎం ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తుపల్లి ఆధ్వర్యంలో శనివారం మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు గంగ్రసోమిరెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వైరా లయిన్ ఐ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు, సత్తుపల్లి వైద్యులతో దంత పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించనునట్లు తెలిపారు

విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం సాయి స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బీటెక్ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి తెలిపారు. వివిధ విభాగాల్లో బొగ్గం శ్రీవాహిణి, బన్నే సిద్ధార్థ, తాళ్లూరి నాగశ్రీ, షేక్ రహీమాన్, మాగంటి కూజిత, షేక్ అప్సన, పాలోజు విజయలక్ష్మి, శీలం సౌమ్య, ఇమ్మనబోయిన సాత్విక, చిన్నంశెట్టి యుగంధర్ ఉత్తమ ఎస్‌జీపీఏ సాధించారని వెల్లడించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద వర్చువల్‌గా అభినందించగా సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ షేక్ మీరాసాహెబ్, డాక్టర్ పాముల శేఖర్‌బాబు, డాక్టర్ షేక్ యాకూబ్ కూడా అభినందించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

తల్లాడ: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కల్యాణం కృష్ణయ్య అన్నారు. తల్లాడ పెన్షనర్స్ భవనంలో శుక్రవారం మండలాధ్యక్షులు కుంచం రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షనర్లకు కాలానుగుణంగా రావాల్సిన కరువుభత్యం, పే రివిజన్ ప్రయోజనాలు కల్పించకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వ విధానాలపై జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బయ్య మాట్లాడుతూ... ఆర్థిక ప్రయోజనాలను విడుదల చేయకుండా ప్రభుత్వం తీవ్ర మానసిక వేదనకు గురి చేస్తుందన్నారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడిగా కుంచం రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా మండేపూడి లక్ష్మయ్య, ఆర్థిక కార్యదర్శిగా బీరెడ్డి తిరుపతిరెడ్డి, సహాధ్యక్షుడిగా మల్లీడి కోటేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులుగా ఇందోజు బ్రహ్మయ్య, మేలక అనసూర్య, సహాయ కార్యదర్శిగా తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పఠాన్ మదార్ ఖాన్, ప్రచార కార్యదర్శిగా సుతారి లలిత, జిల్లా కౌన్సిలర్‌గా దిరిశాల వెంకటరామయ్యలను ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి తాళ్లూరి వేణు, ఆర్గనైజింగ్ కార్యదర్శి దగ్గుల రఘుపతిరెడ్డి, నరసయ్య, కృష్ణారావు, జయశంకర్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి



నిర్మాణాలను పరిశీలిస్తున్న ఏఈ సుప్రియ

చింతకాని: లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ మండల ఏఈ సుప్రియ అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లబ్ధిదారులు నిర్మాణాలను జరుపుకుంటే ప్రభుత్వం విడతల వారీగా డబ్బులను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయటం జరుగుతుందన్నారు. నిర్మాణాలపై లబ్ధిదారులకు తగు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి కవిత, నాయకులు పగడాల రాధాకృష్ణ, రాజశేఖర్, పంది మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మధిర: అమృత్ భారత్ పథకంతో రూ.25 కోట్ల వ్యయంతో జరుగుతున్న మధిర రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను బీజేపీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ మాస్టర్‌ని అడిగి రైళ్ల హాల్టింగ్, ప్రయాణికుల సౌకర్యాలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు గడ్డం శ్రీహరి చౌదరి, శివరాజు సుమంత్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గుగులోత్ నాగేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు, నాయకులు గుండా చంద్రశేఖర్ రెడ్డి, పాపట్ల రమేష్, చిలువేరు సాంబశివరావు, మర్సకట్ల స్వర్ణాకర్, పెరుమాళ్లపల్లి మోహన్ రావు, దోర్నాల దినకర్, ఖాజామియా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో పాడైన గుడ్లు

మధిర: మధిర ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి శుక్రవారం పాడైపోయిన కోడిగుడ్లు ఇచ్చారు. ఇన్ పేషెంట్లకు ప్రతిరోజు ఆహారంలో భాగంగా కోడిగుడ్డు సరఫరా చేస్తారు. అయితే, శుక్రవారం ఇచ్చిన గుడ్లు దుర్వాసన వస్తుండడంతో నిరసన తెలిపారు. ఇవి తింటే వ్యాధి తగ్గకపోగా మరింత పెరుగుతుందని వాపోయారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

చింతకాని: మండల పరిధిలోని రేపల్లెవాడ గ్రామంలో నాగుబండి వెంకటనారాయణకు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు. మడుపల్లి భాస్కర్, బండి శ్రీను, మడుపల్లి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో డైలీవేజ్ వర్కర్లు

ఏన్కూరు: మండల పరిధిలోని మూలపోచారం ఆశ్రమ పాఠశాలలో డైలీవేజ్ వర్కర్లు శుక్రవారం నిరవధిక సమ్మె చేపట్టారు. వేతనాలు తగ్గించే జీవోనంబర్ 64 అమలును నిలిపివేయాలని, కలెక్టర్ కనీస వేతనాల గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన



మాట్లాడుతున్న మధు

సత్తుపల్లి: ఆన్‌లైన్ మోసాలపై స్థానిక జేవీఆర్ ఐటీఐ కళాశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ సత్తుపల్లి మండల చైర్మన్ ఆన్సర్‌బుక్ మధు మాట్లాడుతూ.. ఇంటర్నెట్ వాడేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, మోసాలు జరిగితే వెంటనే 1830 నెంబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. పెనుబల్లి మండల చైర్మన్ చెక్కిలాల సందీప్, వేంసూరు మండల చైర్మన్ శేఖర్, జాయింట్ సెక్రటరీ నాగరాజు, జేవీఆర్ ఐటీఐ కళాశాల చైర్మన్ మాధవరావు, మాధవి, రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17 నుంచి సేవా కార్యక్రమాలు

తల్లాడ: ప్రధాని మోదీ జన్మదినం పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలకేంద్రంలో ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు సేవే లక్ష్యంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు బీజేపీ మండల అధ్యక్షులు చల్లా నాగులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు గాదె కృష్ణారావు, నాయకులు రాయల రమేష్, నరేష్, శ్రీనివాసరావు, తమ్మిశెట్టి కృష్ణ, చౌడా నాగేశ్వర్‌రావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

బోనకల్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద శుక్రవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ పొదిలి వెంకన్న తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట కూపన్ లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే, ఇసుక ట్రాక్టర్ ట్రక్కుపై మ్యాట్ తప్పక కప్పాలని సూచించారు.

ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలి



కల్లూరురూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు నాయకులు అన్నారు. సీపీఎం జాతీయ నాయకులు సీతారాం ఏచూరి వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. – సాక్షినెట్‌వర్క్



కొణిజర్లలో..



ఎర్రుపాలెంలో..

ఆందోళనలు.. ధర్నాలు.. వినతులు

- యూరియా అందించాలని..



సత్తుపల్లిరూరల్: ధర్నా అనంతరం వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్/ పెనుబల్లి: సత్తుపల్లి, పెనుబల్లి మండల రైతులకు సరిపడా యూరియా అందించాలని ఆయా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఏజెన్సీలో ఉన్న రైతులకు ఆధార్‌కార్డుపై సప్లయి చేయాలని, పేద, సన్నకారు, మధ్యతరగతి, రైతులకు ఏజెన్సీలో పట్టాదారు పాస్‌పుస్తకాలు లేకపోవటంతో అధికారులు దీనిని పరిగణలోకి తీసుకోవాలన్నారు.



పెనుబల్లిలో..

- ఇసుక రవాణా అరికట్టాలి

ముదిగొండ: మున్నేరు పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ సునీత ఎల్జిబెత్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా గంగాపురం, చింతకాని మండలం చిన్నమండవ శివారు ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా చేపడుతున్నారన్నారు. నాయకులు వెంకట్రావు, వీరభద్రం, రాంబాబు, ఉపేందర్, పుల్లారావు, వీరస్వామి, రవీంద్రబాబు పాల్గొన్నారు.

- విద్యుత్ లైన్ తొలగించాలని ఆందోళన



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీలోని ద్వారకాపురి కాలనీలో నిరుపేదల ఇళ్లపై ఉన్న 11 కేవీ విద్యుత్‌లైన్‌ను తొలగించాలని సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్ ఎదుట ఆందోళన నిర్వహించి తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ, వీరయ్య, రాజశేఖర్, ఖాసీం, రమేష్, నాగరాజు, సత్యావతి పాల్గొన్నారు.

- పంటనష్టంపై సర్వే నిర్వహించాలి



ధర్నాలో నాయకులు

బోనకల్: తుఫాన్ ప్రభావంతో జరిగిన పంటనష్టంపై సర్వే నిర్వహించి, రైతులకు నష్టపరిహారం అందించాలని రైతుసంఘం మధిర డివిజన్ కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, కార్యదర్శి తుళ్లూరి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పూర్తిస్థాయిలో పంటనష్టం జరిగిందన్నారు. కౌలు రైతుల పరి స్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. దొండపాటి సత్యనారాయణ, తిరుపతిరావు, జొన్నలగడ్డ సునీత, గుడ్దూరి ఉమ, హరికిషన్‌రావు, శ్రీను పాల్గొన్నారు.

- అండర్ పాస్ ఎత్తు పెంచాలి

మధిర: మండలపరిధిలోని సిరిపురం సమీపంలో మిట్టగూడెం వెళ్లే రహదారిపై అమరావతి- నాగపూర్ హైవే అండర్ పాస్ ఎత్తు పెంచాలని కోరుతూ శుక్రవారం రైతులు నిరసన తెలిపారు. ఎండపల్లి గుట్ట ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేశారని, అటుగా భారీ వాహనాలు వెళ్లే అవకాశం ఉన్నందున రైతులకు వ్యాపార, వాణిజ్య పనులకు అనువుగా ఉండాలంటే అండర్‌పాస్ ఎత్తు పెంచాలని డిమాండ్ చేశారు.